# కథ

# అప్పల అప్పారావు

## వాణిశ్రీ

అమృతరావు రాయల్ రెసిడెన్సీలో నలభై లక్షలు పెట్టి డీలక్స్ త్రీ బెడ్ రూం ఫ్లాట్ కొన్నాడు. అందులో మొత్తం పదహారు ఫ్లాట్లు. పదిహేను మంది ఓనర్స్ ఎప్పుడో గృహప్రవేశం చేసి దిగిపోయారు. అమృతరావు రాజస్థాన్ నుంచి తెప్పించిన మార్బుల్ స్టోన్ రావడం లేటయింది. టేక్ వుడ్‌తో కప్‌బోర్డులు చేయించాడు. ఖరీదైన బాత్‌రూం ఫిట్టింగ్స్ వేయించాడు. హాల్లో ఖరీదైన కార్పెట్, సోఫాసెట్, ఫ్యాన్సీ ఎలక్ట్రికల్ బల్బులు బిగించాడు. బంధు మిత్రులను ఆహ్వానించి అట్టహాసంగా గృహప్రవేశం చేశాడు. గెస్ట్‌లు తెచ్చిన గిఫ్ట్‌లు అందుకుని, తను కూడా రిటన్ గిఫ్ట్‌లు ఇచ్చింది అమృతరావు భార్య శాంత. అందరూ ఫ్లాట్ పోష్‌గా బాగుందని మెచ్చుకున్నారు. పనిలో పనిగా రెసిడెన్సీలోని ఓనర్స్ కుటుంబాలనీ విందు భోజనానికి ఆహ్వానించి పరిచయం చేసుకున్నాడు అమృతరావు.

పదిహేను రోజులు గడిచిన తర్వాత పక్క ఫ్లాట్‌లో వుంటున్న రిటైర్డ్ మేజర్ శ్రీకాంత్ భార్య కమలమ్మ చెప్పిన మాటలు శాంతకు షాక్ కలిగించాయి.

"మీవారు ఏం చేస్తారమ్మా?" అని మాటలు కలిపింది కమలమ్మ హాల్లో కూర్చుంటూ.

"రియల్ ఎస్టేట్ బిజినెస్ ఆంటీ" అన్నది శాంత.

"ఐతే బాగానే సంపాదించి వుండాలే"

శాంత నవ్వి వూరుకుంది.

"బిజినెస్ విషయాలేవీ నాకు చెప్పరు ఆంటీ" అన్నది తర్వాత కాసేపటికి కాఫీ అందిస్తూ.

"ఈ ఫ్లాట్ బ్యాంక్ లోన్ తీసుకుని కొన్నారా?" అని అడిగిందామె.

"ఏమో ఆంటీ"

"ఏం లేదు... నిన్న మీవారు, మా ఫ్లాట్‌కి వచ్చి అంకుల్ టెన్ థౌజండ్ వుంటే హాండ్ లోన్ ఇవ్వండి, బ్యాంక్ లోన్‌కి ఇన్‌స్టాల్‌మెంటు కట్టాలి. తక్కువైంది క్యాష్ అని అడిగి పట్టుకెళ్లాడు. అందుకని అడిగా" అన్నది కమలమ్మ.

శాంత షాక్ తిన్నది. సూట్‌కేసుల్లో చాలాసార్లు నోట్ల కట్టలు తేవడం, బీరువాలో పెట్టడం తను ఎన్నోసార్లు చూసింది. పదివేల కోసం ముక్కూ మొఖం తెలియని పక్క ఫ్లాట్ వాళ్లని అప్పు అడగాల్సినంత ఖర్మేం బట్టింది. బ్యాంక్ వాళ్లు ఏమైనా ఇంటికొచ్చి ఇన్‌స్టాల్‌మెంట్ కట్టమని గొంతు మీద కూర్చున్నారా?

కమలమ్మ గుచ్చిగుచ్చి అడిగితే తలకొట్టేసినట్టయింది శాంతకి.

అమృతరావు ఇంటికి రాగానే మండిపడింది. అతగాడు ఈ విషయాన్ని ఏమంత సీరియస్‌గా తీసుకోలేదు.

"అప్పుడప్పుడు అటువంటి అవసరం అందరికీ కలుగుతుంది. ఇచ్చిపుచ్చుకోవడానికే ఇరుగుపొరుగు వున్నది. దీనికి నువ్వేం పెద్ద ఫీలైపోకు" అన్నాడు.

తర్వాత కొన్ని రోజులకి సెకండ్ ఫ్లోర్‌లో వుంటున్న బ్యాంక్ మేనేజర్ భార్య జయ బెల్ కొట్టి ఫ్లాట్ లోపలకు వచ్చి "బాగున్నారా?" అంది నవ్వుతూ.

"రండి. బాగానే వున్నాం" అన్నది శాంత.

జయ సోఫాలో కూర్చుని హాలంతా పరికించి చూస్తూ "పిల్లలు స్కూలుకెళ్లినట్టున్నారు. మీకు బోర్‌గా వుందేమో?" అన్నది.

"బోర్ ఏం లేదులెండి. కాసేపటికి పని మనిషి వచ్చి అంట్లు తోముతుంది. అది వెళ్లిన కాసేపటికి చాకలి వచ్చి బట్టలు వుతుకుతుంది. తర్వాత వంటపని. ఇంకేం వుంది లంచ్ టైమ్ అయిపోతుంది. ఇక ఆయన లంచ్‌కి వచ్చి ఈవెనింగ్ ఫోర్ వరకు వుండి ఆఫీసుకి వెళ్తారు" అంది శాంత.

"మీవారి ఆఫీసు ఎక్కడ?"

"మియాపూర్‌లో"

"బిజినెస్ బాగా వుందా? ఇప్పుడు రియల్ ఎస్టేట్ బిజినెస్ ఇబ్బందుల్లో వుందని చెప్పుకుంటున్నారు. మావారు చెప్తే తెలిసింది నాకు. చాలామంది బ్యాంక్ లోన్స్ తీర్చలేక సతమతమైపోతున్నారట"

"ఏమోనండి, నాకు మావారు బిజినెస్ విషయాలు ఏమీ చెప్పరు" అని నవ్వింది శాంత.

లోలోపల ఈవిడకెందుకో ఇవన్నీ? పనీపాటా లేకపోతే సరి అని పళ్లు కొరుక్కుంది.

"ఏం లేదు. నిన్న మీవారు మావారి దగ్గరికొచ్చి మీ బ్యాంక్‌లో పర్సనల్ లోన్ ఏదైనా ఇప్పిస్తారా అని అడుగుతున్నారు. అందుకని అడుగుతున్నా! రియల్ ఎస్టేట్ బిజినెస్సేగా మీ వారిదీ! బిజినెస్ బాగుంటే పర్సనల్ లోన్ ఏం ఖర్మ?" అన్నది జయ వెటకారంగా.

శాంతకి ఒళ్లంతా కారం పూసుకున్నట్టు మండిపోయింది. లంచ్ టైములో వచ్చిన అమృతరావుని పట్టుకుని నిలదీసింది.

"మీ ఆడాళ్లకి ఏం పనిలేదోయ్! మగాళ్ల సంగతులెందుకు చెప్పు? బిజినెస్ అంటే ఎన్నో అడ్జస్ట్‌మెంట్లు వుంటాయి. ఎక్కడెక్కడో అప్పులు చేయాల్సి వస్తుంది. ఐనా నీకెందుకు ఈ గొడవలు? నీకేం తక్కువైంది? నలభై లక్షల ఫ్లాట్‌లో లక్షణంగా వుంటున్నావు. మూడు పూటలా... మూడేంటి సాయంకాలం సమోసాలో, స్నాక్సో లాగిస్తావు కదా! నాలుగు పూటలా కడుపు నిండా తింటున్నావు. చీకూ చింతా లేదు నీకు. ఇంట్లో నుంచి బైటకు అడుగుపెట్టాక అడ్డమైన గాడిదకి నమస్తే అని తిరుక్కుంటూ పదరాని పాట్లు పడాల్సొస్తుంది. ఐనా నేను బ్యాంక్‌లోన్ తీసుకుంటే నీకేం చిన్నతనం? అంతగా ప్రెస్టేజీ ఫీలైపోతే మీ నాన్ననడిగి పది లక్షలు క్యాష్ తీసుకురా! ఇక్కడ ఎవర్నీ అప్పడగకుండా వుంటా" అని అమృతరావు శాంతకి క్లాసు పీకాడు.

"మా నాన్నని ఇందులోకి ఎందుకు లాగుతారూ?" అని మూతి ముడిచింది శాంత.

ఒకసారి అపార్ట్‌మెంట్ వాచ్‌మేన్ మల్లయ్య వచ్చి "అమ్మగారూ! మూడు నెలల నుంచి మెయింటెనెన్స్ ఇవ్వలేదండి" అన్నాడు.

"మూడు నెలల నుంచీ ఇవ్వలేదా?" ఆశ్చర్యపోయింది శాంత.

"ఔనమ్మా! ప్రెసిడెంట్‌గారు నేను అడగడం లేదని నన్ను కోప్పడుతున్నారు"

"ఆయన వచ్చాక చెప్తాలే" అన్నది శాంత.

"సరేనమ్మా!" అని వెళ్లిపోయాడు మల్లయ్య.

అమృతరావు రాగానే మొదలుపెట్టింది శాంత.

"మెయింటెనెన్స్ డబ్బులు మూడు నెలల నుంచీ ఇవ్వడం లేదంటగా?" అన్నది శాంత.

"ఎవరు చెప్పారు?"

"ఇంకెవరు? వాచ్‌మేన్. ఇందాకే వచ్చి అడిగిపోయాడు. ఐనా మెయింటెనెన్స్ మూడు నెలలు పెండింగ్ పెట్టడం దేనికి? ఎప్పటివప్పుడు వాళ్ల మొఖాన పారేస్తే ఇంటికొచ్చి అడగరుగా?" ముఖం మాడ్చుకుని అన్నది శాంత.

"నువ్వెందుకు అంత ఫీలైపోవడం?" అని అమృతరావు కోపంగా ఫ్లాట్ బైటకు వెళ్లి "వాచ్‌మేన్..వాచ్‌మేన్" అని కేకలు పెట్టాడు.

వాచ్‌మేన్ మెయింటెనెన్స్ బుక్ పట్టుకుని వచ్చాడు.

"ఏం మల్లయ్యా! మెయింటెనెన్స్ నేను పిలిచి ఇస్తానని చెప్పానా లేదా?" అన్నాడు గట్టిగా.

"అవును సార్"

"మరి ఇంటికొచ్చి మూడు నెలల నుంచి ఇవ్వలేదని అడిగావటగా?"

"ప్రెసిడెంట్ గారు రిజిస్టర్ చెక్ చేసి, నేను మిమ్మల్ని అడగడం లేదని, నాదే తప్పనీ అడుగుతూ వుండాలని చెప్పారయ్యా.. అందుకని అడిగా" సంజాయిషీ ఇచ్చుకున్నాడు మల్లయ్య.

"ఎంతయ్యా అడుగుతూ వుండేది? లక్ష పైగా

మెయింటెనెన్స్ దబ్బు జమపడి వుంది. ఏమిటంత అర్జెంటు? ఉన్నప్పుడు ఇస్తాం. మా ఇబ్బందులు మాకుంటాయి. ఇంకెప్పుడూ ఇంటికొచ్చి అడగకు" అని వాచ్‌మేన్ మల్లయ్య మీద కేకలు వేసి వచ్చాడు అమృతరావు.

శాంతకి తల కొట్టేసినట్టయింది. ఫ్లాట్స్‌లో వున్న ఆడ, మగ, పిల్లా, మేకా అంతా విచిత్రంగా చూస్తుంటే మొగుడి మీద మండుకొచ్చింది. ఎందుకు అంతంత కేకలు పెట్టడం? చూసేవాళ్లు ఏమనుకుంటారు? మెయింటెనెన్స్ దబ్బు ఇవ్వడానిక్కూడా వీళ్ల దగ్గర లేవన్నమాట. అంతగా లేని వాళ్లు నలభై లక్షలు అప్పు చేసి ఫ్లాట్ కొనడం ఎందుకు? ఏ పది, పన్నెండు లక్షలకో పాత ఫ్లాట్ కొనుక్కోవచ్చుగా అనుకోరూ!

అమృతరావు బాత్‌రూంలో దూరి స్నానం చేసి ఫ్రెషయి వచ్చాడు. ఈ లోపల పిల్లలు కూడా వచ్చారు.

"శాంతా! రాత్రికి వంట చెయ్యకు. తాజ్ బంజారాలో డిన్నర్ చేసి, సెకండ్ షోకి సినిమాకెళ్దాం" అన్నాడు నవ్వుతూ.

"థాంక్యూ డాడీ" అని పిల్లలు అమృతరావుని అల్లుకున్నారు, ముద్దులుపెడుతూ.

"అప్పుచేసి పప్పు కూడు అంటారు దీన్నే. ఒకవైపు మెయింటెనెన్స్ కట్టలేదు. స్టార్‌హోటల్లో డిన్నర్లకి వేలకి వేలు తగలెయ్యడం" అన్నది రుసరుసలాడుతూ.

అమృతరావు చిరునవ్వు నవ్వి "అంతా రెడీగా వుండండి. ఇప్పుడే వస్తా" అని వెళ్లిపోయాడు.

'ఈ మనిషిని అర్థం చేసుకోవడం నా వల్ల కాదు' అని గొణుక్కుంది శాంత.

★ ★ ★


పని మనిషి అక్తర్ సింక్‌లో అంట్లు తోముతుంటే వంటగదిలోకి వచ్చాడు అమృతరావు. అక్కడే వున్న శాంత ఎగాదిగా చూసింది మొగుడివైపు. అమృతరావు వంటగదిలోకి ఎప్పుడూ రాడు. హాల్లో కూర్చునే కాఫీ కావాలనో, బజ్జీలు వేయమనో కేకలు పెడతాడు. అలాంటివాడు సరాసరి వంటగదిలోకి ఎందుకొచ్చినట్టు? అక్తర్ ఎర్రగా బుర్రగా గ్లామర్‌గా వుంటుంది. దీనికి ఇంకా పెళ్లి కూడా కాలేదు. కొంపదీసి దీనిమీద కన్నేశాడా? ఏం ? అని ఒక్క క్షణం అనుమానంలో పడింది శాంత.

సరాసరి అక్తర్ దగ్గరికి వెళ్లి "అక్తర్!" అన్నాడు అమృతరావు నవ్వు ముఖంతో.

అక్తర్ ఉలిక్కిపడి "ఏమిటి సాబ్?" అన్నది కొంచెం బెదిరిపోయి.

శాంత దగ్గి "నేను ఇక్కడే వున్నాను" అన్నది కోపంగా.

"వున్నావులేవోయ్! నువ్వు లేవనుకుని రాలేదు" అని



నవ్వాడు.

శాంతకి మండుకొచ్చింది.

"దాంతో ఏం పనండీ మీకు? ఏం కావాలి?" అన్నది తీవ్రంగా.

"పనుందిలేవోయ్! అక్తర్ నువ్వు ఇంటికెళ్లేటప్పుడు నా దగ్గరికి ఒకసారి వచ్చి వెళ్లు. బెడ్‌రూంలో వెయిట్ చేస్తుంటాను" అన్నాడు.

అక్తర్ శాంతవైపు అమృతరావు వైపు మార్చి మార్చి చూస్తూ, కనుగుడ్లు తిప్పుతూ "సరే! సాబ్" అన్నది.

అమృతరావు శాంతవైపు కొంటెగా చూసి చిలిపిగా నవ్వుతూ వెళ్లిపోయాడు. శాంత పళ్లు పటపట లాడించింది. వెధవ్వేషాలు కూడా మొదలుపెట్టాడన్నమాట. 'హమ్మా! ఎంత తెగించాడు? కట్టుకున్న పెళ్లాం ఎదురుగా వుండగానే దాన్ని బెడ్‌రూంలోకి రమ్మని పిలుస్తాడా? వీళ్లిద్దరి సంగతి తేలుస్తా! గరిట కాల్చి వాత పెట్టకపోతే నా పేరు శాంతే కాదు' అనుకుంది ఉడికిపోతూ.

అక్తర్ పని ముగించుకుని "సాబ్ ఎందుకో బెడ్‌రూంలోకి రమ్మన్నాడు. పోయొస్తా" అంది.

శాంత అక్తర్‌ని బెడ్‌రూంలోకి పోనిచ్చి, వాకిలి దగ్గర నిలబడింది. అక్తర్ లోపలకు రాగానే అమృతరావు తలుపులు బిగిస్తాడేమో అనుకుంది కానీ అలాంటిదేమీ జరగలేదు. లోపల నుంచి మాటలు వినిపిస్తున్నాయి.

"అక్తర్! మీ బస్తీలో జంగ్లీ యూసఫ్ అని లీడర్ వున్నాడంటగా. నీకు ఎరికేనా?"

"ఎరికే సాబ్! మా భాయ్‌కి దోస్త్. క్యాహోనా సాబ్?" అడిగింది అక్తర్.

"యూసఫ్ అప్పులిస్తాడంటగా! అర్జెంట్‌గా పాంచ్ లాఖ్ ఇప్పిస్తావేమోనని" అన్నాడు.

"నేనా సాబ్?"

"నువ్వే! యూసఫ్ దగ్గర అప్పు ఇప్పిచ్చావంటే నీకు మంచి నజ్రానా ఇస్తా! ఏమంటవు?"

"భాయ్‌తో చెప్తా సాబ్"

"అచ్చా!" అన్నాడు అమృతరావు.

అక్తర్ బెడ్‌రూంలో నుంచి వస్తుంటే శాంత వడివడిగా వెళ్లి సోఫాలో చతికిల పడింది ఏమీ ఎరగని దానిలా.

"ఏంటే అక్తర్! అయ్యగారు ఏమన్నాడు? నీతో ఏంటి పని?" అడిగింది శాంత.

"సాబ్‌కి అప్పు ఇప్పియ్యాల్నంట" అని ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ వెళ్లిపోయింది.

శాంత నెత్తీ నోరూ బాదుకుంది. ఎంత హీనమైపోయిందీ? ఆఖరికి తమది అప్పుల బతుకని పనిమనిషికి కూడా తెలిసిపోయింది. ఇప్పటికే అపార్ట్‌మెంట్‌లో కనిపించిన వారినల్లా అప్పులు అడుగుతూ వుంటే 'అప్పుల అప్పారావు' అని నిక్‌నేమ్ తగిలించి నవ్వుకుంటున్నారు అంతా! ఖర్మ!!

ఆ రాత్రి తండ్రికి ఫోన్ చేసి విషయమంతా వివరంగా చెప్పి "ఇక్కడ తలెత్తుకోలేకపోతున్నా నాన్నా! అంతా అప్పుల అప్పారావు అని నవ్వుకుంటున్నారు. నువ్వొకసారి వచ్చిపో" అన్నది శాంత.

మర్నాడు లంచ్ టైమ్‌కి దిగాడు శాంత తండ్రి వెంకట సుబ్బయ్య. "రండి మామయ్యా! మిమ్మల్ని రమ్మని కాల్ చేద్దామనుకుంటున్నా! మీరే వచ్చారు. అంతా కులాసానా" అన్నాడు అమృతరావు.

'కాల్ చేద్దామనుకుంటున్నారా! ఎందుకూ? అప్పు అడగడానికేగా' అని పళ్లు పటపటలాడించింది శాంత.

లంచ్ చేసిన తర్వాత, "మావయ్యా! మన వైపు మిరప వేసిన వాళ్లకి అరవై, డెబ్భై వేలు మిగిలాయట కదా! పాతిక లక్షలు క్యాష్ వుంది. రోడ్డుకి దగ్గర్లో మెట్ట పొలం, నల్లరేగడి వుంటే బేరం చెయ్యండి" అన్నాడు అమృతరావు.

శాంత తల తిరిగి మూర్ఛ వచ్చినట్టయింది. మొగుడు చెప్పేది నిజమా? జోకా? ఒక వైపు ఇక్కడ అందరికీ ఐదు వేలు, పది వేలు అప్పులు చేస్తూ అక్కడ పొలాలు కొంటాడా?

వెంకట సుబ్బయ్య కూతురివైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఏంటల్లుడూ! నువ్వేదో ఇక్కడ అందర్నీ అప్పులు అడుగుతున్నావనీ..."

మామగారి మాటలకు అడ్డొచ్చాడు అమృతరావు.



"ఇక్కడ అల్లాగే వుండాలి మావయ్యా! మన దగ్గర డబ్బులు లేనట్టు, ఇబ్బందులు పడుతున్నట్టు నాటకాలాడడం సేఫ్. మా బిజినెస్‌లో నోట్లకట్టలు సూట్‌కేసులలో తిరుగుతుంటాయి. ఇక్కడ ఆ విషయం తెలిసేదీ లీక్ అయ్యేదీ తెలిసిన వాళ్ల ద్వారానే. పట్టపగలే దోచుకెళ్లే ఛాన్సుంది. అందుకే అందరినీ అప్పులడుగుతూ అప్పుల అప్పారావుగా పేరు తెచ్చుకున్నాను. ఇంకో ఉపయోగం కూడా వుంది. నన్నెవరూ అప్పులు అడగరు" అని పకపకా నవ్వాడు అమృతరావు.

"ఈ సంగతి నాతో ఒక ముక్క అనొచ్చుగా" బుంగమూతి పెట్టి అన్నది శాంత, అమృతరావు వైపు క్రీగంట చూస్తూ.

"మీ ఆడవాళ్ల నోట్లో నువ్వుగింజ నానుతుందా? వెయ్యి రూపాయలుంటే లక్ష రూపాయలున్నట్టు పోజులు కొడతారు. మీకు బడాయిలు ఎక్కువ" అన్నాడు అమృతరావు.

## ఎందుకో..?

మమతా మోహన్‌దాస్ చాలావరకు మోడర్న్ డ్రెస్సుల్లోనే దర్శనమిస్తూంటుంది. అయితే ఆమెకి మాత్రం భారతీయ సాంప్రదాయాలంటే తెగ నచ్చుతాయట. ఆడవాళ్లు చీరలు కట్టుకుంటేనే ఎంతో బావుంటారనిపిస్తుంటుందిట. అందుకనే తనకి కూడా చీరలకు కట్టుకోవడం భలే ఇష్టం అంటుంది మమతా మోహన్‌దాస్. చీరలో వుండే స్టయిలే వేరు అని నొక్కి వక్కాణించే మమతా మేడమ్ ఎక్కువగా జీన్స్‌లు గట్రాల్లోనే మరి కనిపిస్తారెందుకో?

"మా అమ్మాయికి తొందరపాటు ఎక్కువలే! నేను ఇంకేంటో అనుకుని హడలిపోయాను. సరే వెళ్లొస్తా! శాతవాహనకి టైముంది" అన్నాడు వెంకట సుబ్బయ్య.

"రెండు రోజులుండు నాన్నా! నువ్వసలు రానే రావు. ఎప్పుడొచ్చినా చెప్పులు కాళ్లల్లో పెట్టుకుని వస్తావు" అన్నది శాంత.

"లేదమ్మా! అర్జెంట్ పనులున్నాయి. మిరపనారు కోసం వెళ్లాలి" అన్నాడు వెంకట సుబ్బయ్య.

అమృతరావు కోటు జేబులో నుంచి సరికొత్త వెయ్యి రూపాయల నోట్ల కట్ట తీసి మామగారి చేతికిచ్చి "ఏదైనా కుదిరితే బయానా ఇవ్వండి" అన్నాడు.

"బయానా లక్ష ఎందుకు?"

"ఉంచండి" అన్నాడు అమృతరావు.

శాంత కళ్లు మిలమిల మెరిశాయి. తను భయపడినట్టు తన భర్త అప్పుల అప్పారావు కాదు. అపర కుబేరుడే అనుకుని మురిసిపోయింది.

★